క్లుప్తంగా

కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

ఉయ్యాలవాడ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు మండలంలో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని మండల అసిస్టెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా అనంతరం మండలంలో ఇప్పటి వరకు 548 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.

విగ్రహాలకు ముసుగు



గోస్పాడులో సచివాలయ శిలాఫలకాలకు పేపర్లు అతికించిన దృశ్యం

గోస్పాడు: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన నాయకుల విగ్రహాలు, బోర్డులు, శిలాఫలకాలకు అధికారులు, యంతాంగం ముసుగుల తొడిగారు. పంచాయతీ సిబ్బంది, ఫ్లెక్సీ, పార్టీ జెండాలను తొలగించారు. తహసీల్దార్ భార్గవి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతులు లేనిదే గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించ రాదన్నారు. ఇప్పటికే గ్రామాలలోని రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, జెండాలను తొలగించడంతో పాటు విగ్రహాలకు ముసుగులు వేసినట్లు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెమిర్తి గ్రామానికి చెందిన కోనేటి సతీష్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కూడలిలో దారినపోయే మహిళల పట్ల అసభ్యపదజాలంతో దూశిసూ ఈలలు, కేకలు, వేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు నిందితుడిపైన సెక్షన్ 294 ఐపీసీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఏడు రోజులు శిక్షను విధించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



40వ వార్డు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు. 6, 7, 40, 41 వ వార్డు సచివాలయాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం వార్డులలో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

జగజ్జననీ మాతకు శ్రీచక్రార్చన



అమ్మవారికి శ్రీచక్రార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): శ్రీజగజ్జననీ దేవాలయ ఆలయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని నాల్గవ రోజు అమ్మవారికి శ్రీచక్రార్చన వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్తంగా వేదమంత్రాలచే నవారణ పూజా విధితో శ్రీచక్రార్చన నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలన అందజేశారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు

రుద్రవరం: మండల కేంద్రంలోని ఆటో స్టాండ్‌లో మంగళవారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రంగా ఉండటంతో ఆళ్లగడ్డ వైపు రాక పోకలు సాగించే ప్రయాణికులు, సమీపంలోని పాఠశాలలో పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల దాహం తీర్చేందుకు ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు చందాలుగా వేసుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజున మజ్జిగ పోసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఎనలేని సంక్షేమం.. వెల్లువెత్తిన అభిమానం

- జి.జమ్మలదిన్నె నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ఇంటింటి ప్రచారంలో బహ్మారథం పట్టిన ప్రజలు
- అందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాయని చెబుతున్న వైనం
- సంక్షేపథకాల సారథి జగన్‌కే ఓటు వేస్తామని వెల్లడి



అవ్వా,తాతతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల



జిజమ్మలదిన్నె గ్రామంలో పర్యటిస్తున్న గంగుల

ఆళ్లగడ్డ : ఇంటింటికి ప్రచారం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిప సంక్షేమ పథకాల ద్వారా పేదల ఇళ్లల్లో ప్రతి ఇంటా లబ్ధి చేకూరిందని, 95 శాతం పైగా కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాయని, అనేక మందికి రూ. లక్షల్లో నగదు జమ అయినట్లు రూరల్ మండలం జిజమ్మలదిన్నె గ్రామంలో లబ్ధిదారులు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి సంతోషంగా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే మంగళవారం ఇంటి ప్రచారం మొదలు పెట్టారు. ఆనవాయితీ ప్రకారం ఎన్నికల ప్రచారం జి.జమ్మలదిన్నె నుంచి ప్రారంభించారు. ప్రచారానికి గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులకు మంగళ వాయిద్యాలతో, పూల వర్షం కురిపిస్తూ కుంకుమ తిలకాలు దిద్దుతూ గ్రామస్తులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రచారంలో ప్రజలు ఆద్యంతం బ్రహ్మరథం పట్టారు.

గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి

ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో నడిపించామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. గతంలో ఏం చేశారో?. ఇప్పుడు ఏం చేస్తారో చెప్పుకోలేని దుస్థితిలో టీడీపీ ఉందన్నారు. 660 హామీలు ఇచ్చి ఇందులో 6 హామీలు కూడా సక్రమంగా అమలు చేయలేదని, మళ్లీ ఇప్పుడు అదే విధంగా హామీలు ఇస్తున్నారని మోస పోవద్దని ప్రజలకు సూచించారు. అభివృద్ధి సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొట్టె నాగేశ్వర్‌రావు, మండల జేసీఎస్ కన్వీనర్ రామకృష్ణ, నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ నందీశ్వరయ్య తదితరులు ఉన్నారు

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించుకుందాం

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం సూచించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పక పాటించి సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం రాత్రి కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, రాజకీయ పార్టీ అభ్యర్థులు చేయాల్సిన ఖర్చులపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 18న సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ 25, నామినేషన్ల పరిశీలన 26, నామినేషన్ల ఉపసంహరణ 29, పోలింగ్ మే 13న, జూన్ 4వ తేదీన కౌంటింగ్ ఉంటుందన్నారు. ఈ మేరకు పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలను లెక్కించేందుకు ఐదు రకాల టీంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3 ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్స్, 10 స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్ పర్యవేక్షిస్తాయన్నారు. దీంతోపాటు పెయిడ్ న్యూస్, సమావేశాల నిర్వహణ, హాజరయ్యే ప్రజలకు పెట్టే అల్పాహారం, భోజనం, ఇతర రిఫ్రెష్మెంట్లను నిర్ధారించిన రేట్లకు లెక్కకట్టి సంబంధిత పార్టీ లేదా అభ్యర్థి ఖాతాలో పొందుపరుస్తామన్నారు. పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు మించరాదన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, వైఎస్సార్‌సీపీ తరఫున అనిల్ అమృత రాజు, కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ శివరామిరెడ్డి, బీఎస్పీ శ్రీనివాసులు, సీపీఐ(ఎం) పూల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద చేరికలతోనే పార్టీ బలోపేతం



పార్టీలో చేరిన వారితో శిల్పా మోహన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ బలవంతపు చేరికలను ప్రోత్సహించదని, స్వచ్ఛంద చేరికలతోనే పార్టీ బలోపేతమవుతుందని మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల నాయకుల బలవంతాల మీద టీడీపీలో చేరిన ఊడుమాల్పురం గ్రామానికి చెందిన పది కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే శిల్పారవి స్వగృహంలో స్వచ్ఛందంగా సొంత గూటికి (వైఎస్సార్‌సీపీ) చేరాయి. వారికి శిల్పా మోహన్‌రెడ్డి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తిక్కారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మురళీధర్‌రెడ్డి, పుల్లారెడ్డిలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీని అభిమానించే కుటుంబాలు ప్రతిపక్ష పార్టీలో చేరినా అక్కడ ఇమడలేక తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిని, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఖాదర్, హుసేన్, గుర్రప్ప, రఫీ, దస్తగిరి, జమాల్, సిద్దయ్య, షేక్షా, గిరి, రసూల్, బాషా, లింగన్న, చాంద్, మౌలాలి, మద్దిలేటి, హరి, పలువురు మహిళలు ఉన్నారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా సరళమ్మ

నంద్యాల(సెంట్రల్): నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకురాలిగా డాక్టర్ సరళమ్మ నియమితులయ్యారు. ఇదివరకు సహసంచాలకుడిగా పనిచేసిన డాక్టర్ ఎన్వీ వెంకటేశ్వర్లు గుంటూరులోని లామ్ ఫారంకు బదిలీ అయ్యారు. డాక్టర్ సరళమ్మ ప్రస్తుతం నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. పరిశోధన స్థానంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేసేలా తనకు అప్పగించిన బాధ్యతల్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ఆమె తెలిపారు.

టెండరు ఫారముల స్వీకరణ వాయిదా

నంద్యాల టౌన్ : జిల్లాలోని ఆర్టీసీ డిపోలలో పలు అవుట్ సోర్సింగ్ పనుల కోసం ఈ నెల 6న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి టెండరు ఫారముల స్వీకరణ వాయిదా వేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ నెల 20వ తేదీన చేపట్టాల్సిన టెండరు ఫారముల స్వీకరణ వాయిదా వేస్తున్నామని, తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

ముస్లింల అభివృద్ధే లక్ష్యం



శిల్పా మోహన్‌రెడ్డితో షేక్ గౌస్‌పీరా

నంద్యాల(అర్బన్): ముస్లిం మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీ షేక్‌గౌస్‌పీరా అన్నారు. తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగం మైనార్టీసెల్ కమిటీ జాయింట్ సెక్రటరీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణానికి చెందిన గౌస్‌పీరా మంగళవారం మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవిని వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతానికి, ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నంద్యాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఒక్క 35వ వార్డులోనే రూ.3.56 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో శిల్పారవిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ హోర్డింగులను అనుమతించొద్దు

నంద్యాల: ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించ వద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును అన్ని జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోనున్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రతి చిన్న ఘటననూ వీడియో తీయాలి



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్ వీడియోగ్రాఫర్లు ఎన్నికలకు సంబంధించిన ప్రతి చిన్న ఘటననూ వీడియోగ్రఫీ చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో అన్ని టీమ్‌ల వీడియోగ్రాఫర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీటీంల వీడియోగ్రాఫర్లు నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా ప్రతి చిన్న సంఘటననూ వీడియో తీసి సంబంధిత టీమ్‌ల అధికారులకు ఇవ్వాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా ఉన్న ప్రతి అంశాన్ని చిత్రీకరించాలని సూచించారు. అలాగే అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, హాజరైన ప్రజలు, సమావేశానికి అయ్యే ఖర్చు, ఓటర్లకు పంపిణీ చేసే వస్తువులు, వినియోగించిన వాహనాలు తదితరాలన్నింటినీ వీడియోగ్రఫీ చేయాలన్నారు. ఎన్నికల సజావు నిర్వహణకు నిష్పక్షపాత వీడియోగ్రఫీ కీలకమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రతి ఒక్కరికి షాడో టీం ఏర్పాటు చేస్తామని, ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి సాక్షాధారాలతో వీడియో ఉంటే ఈసీఐకు పంపుతామన్నారు. సమావేశంలో ఎస్‌డీసీ కామేశ్వరరావు వీడియో తీయాల్సిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశదీకరించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో

నంద్యాల టౌన్ : దీర్ఘ కాలిక వ్యాధులైన రక్త పోటు, మధుమేహం వంటి సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మంగళవారం ఆయన నంద్యాల మండలంలోని చాపిరేవుల, గోస్పాడు మండలంలోని యాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపీలో రోగులకు అందుతున్న ఆరోగ్య సేవలు, మాతాశిశు సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. లేబర్ రూం, ఫార్మసీని పరిశీలించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

ఆళ్లగడ్డ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, ప్రతి అంశం ఎన్నికల నిబంధనలకు లోబడి ఉంటుందని ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ ఎన్నికల ప్రచారాలను ఎప్పటికప్పుడు కమిటీల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు భారత ఎన్నికల సంఘం నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకుని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సహకరించాలని కోరారు. రాజకీయ నాయకుల సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరు మండలాల అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి



సూర్యనారాయణరెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ప్రత్యర్థులు ఎవరూ నామినేషన్ వేయక పోవడంతో సీనియర్ న్యాయవాది సూర్యనారాయణరెడ్డి ప్యానల్ సభ్యులు బార్ అసోసియేషన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇందులో అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ దాదాపీర్, ట్రెజరర్ మురళిమోహన్, మహిళా ప్రతినిధిగా రమదేవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సూర్యనారయణరెడ్డిని, సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

- జనవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి
- పలు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో సమావేశం

ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం



జీనేపల్లిలో మాట్లాడుతున్న జనవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి

శిరివెళ్ల: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయఢంకా మోగిస్తారని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వనికినిదిన్నె, జీనేపల్లె, పార్వతీపురం, బీవీఎస్ నగర్, గాంధీనగరం, రాజనగరం, గుంప్రమాన్‌దిన్నెలలో పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగుల బిజేంద్రారెడ్డిలను పార్టీ అధిష్టానం ప్రకటించిందన్నారు. వారి గెలుపు కోసం కార్యకర్తందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ దాకా కార్యకర్తలందరూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు.

99.5 శాతం హామీల అమలు

ప్రభుత్వ పథకాలతో 85 శాతం కుటుంబాలు లబ్ధి పొందాయని, 99.5 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని గంగుల ప్రభాకరరెడ్డి చెప్పారు. పేదల సంక్షేమం కోసం రూ. 2.76 లక్షల కోట్లు వినియోగించారని తెలిపారు. అధ్వానంగా ఉన్న జీనేపల్లి రోడ్డును రూ. 3 కోట్లతో అభివృద్ధి చేశామని, గడప గడపకు మన ప్రభుత్వం కింద గ్రామ గ్రామానా సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వానికే ఓటు వేసేలా ప్రజలను చైతన్య పరచాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, మండల కోశాధికారి వంకదార సుబ్బసత్యానారాయణశ్రేష్ఠి, సర్పంచులు తలారి జానకమ్మ , రఘునాథరెడ్డి, రాజారెడ్డి, తలారి సుబ్బలక్ష్మమ్మ, మందాల శివారెడ్డి, ఉప సర్పంచు సుబ్బరాయుడు, నాయకులు లాయరు బాబు, రాంపుల్లయ్య, మయ్యన్న, చిన్న ఉశేనిరెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

దొర్నిపాడు: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉంటే అలజడులు రేగే ప్రమాదం ఉందన్నారు. వీధి హోటల్స్, బజ్జీల కొట్టు నిర్వాహకులు ఎక్కువ మంది గుమికూడకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

వివాహాలు చేసేందుకు లైసెన్సులు మంజూరు

నంద్యాల (సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలోని పాస్టర్లు, పురోహితులు తమ పరిధిలోని ప్రార్థనాలయాల్లో వివాహాలు చేసేందుకు ప్రభుత్వపరంగా లైసెన్సులు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని మిడుతూరు మండలం జలకనూరు ఏబీఎం చర్చ్ పాస్టర్ గగ్గటూరు విక్టర్ పాల్‌కు లైసెన్సు జారీ చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీఓ నంబర్ 23లో పేర్కొంది.

పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేద్దాం

నంద్యాల(అర్బన్): పౌష్టికాహార పక్షోత్సవాలను విజయవంతం చేద్దామని నంద్యాల అర్బన్ ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నజీరా, సుజాత పిలుపునిచ్చారు. పట్టణంలోని జగజ్జననీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 23వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతల రక్తహీనత నివారణకు ఆకుకూరలు, కూరగాయలు వాడాలని, వాటిపై కేంద్రం నిర్వాహకులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే పూలంగి సేవా కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం సమర్పించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాద వాదంతో, ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ అధికారం కోసం కుట్రలు పన్నుతున్న నరేంద్రమోదీకి అడ్డుకట్ట వేసేందుకు దేశంలోని మిత్రపక్షాలను బలపర్చాలన్నారు. పది సంవత్సరాల కాలంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటు పరం చేసేందుకు, అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పాలన సాగించారన్నారు. సమావేశంలో బాబాఫక్రుద్దీన్, సోమన్న, సంజీవ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



ఉద్యోగికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు

నంద్యాల టౌన్: నంద్యాల ఆర్టీసీ డిపోలో ఫిబ్రవరి నెలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగులను డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు అభినందించారు. మంగళవారం డిపో ఆవరణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన కండెక్టర్లు పీఎస్ రామయ్య, సత్యనారాయణ, జీవీకే స్వామి, శ్రీనివాసులు, రాజు, డ్రైవర్లు ఎస్‌ఏ హుసేన్, డీఎస్ రావు, ఏసయ్య, బాలరాజు, మాచర్లలను అభినందించి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చడం వల్లే ప్రజలు ఆర్టీసీని ఆదరిస్తున్నారన్నారు. మహాశివరాత్రి సందర్భంగా డిపోకు రూ.43.78 లక్షల ఆదాయం వచ్చిందని, పండుగ సీజన్‌లో వంద శాతం ఓఆర్ సాధించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ విజయ్ కుమార్, స్టేషన్ మేనేజర్ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.